క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



తెనాలిఅర్బన్: శ్రీ వేంకటేశ్వర యోగా సేవా కేంద్రం సభ్యులు కారంపూడి నాగ వెంకట వీరాంజనేయులు, రమాదేవి దంపతుల సహకారంతో నాజర్‌పేటలోని 'మన ఇల్లు' వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ యోగ కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య మాట్లాడుతూ అనేక మంది దాతలు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ధర్మేష్, శ్రీహరి, సాంబ్రాజ్యం, అనూష, ఆశ్రమ నిర్వాహకులు భారతి, మురళి, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబీకులకు ఆర్థిక సాయం



తెనాలిఅర్బన్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెనాలి వాసులు మహ్మద్ హుస్సేన్ బేగ్, మహ్మద్ ఇస్మాయేల్ బేగ్ కుటుంబ సభ్యులను డాక్టర్ జాఫర్ సాధిక్ ట్రస్ట్ చైర్మన్ షేక్ ఖలీల్ సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. యుక్త వయసులో వారు చనిపోవడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల తల్లిదండ్రులు ఆషాబేగం, ఖలీల్ బేగంలకు ధైర్యం చెప్పి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట కాజా సలీమ్, షేక్ నాజర్, షేక్ బాబా, నఫీజ్, బాషా, బుజ్జి, షంషాద్ ఉన్నారు.

అరబిందో సొసైటీ చైర్మన్ రాఘవేంద్రరావు మృతి



తెనాలి: పట్టణానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్, అరబిందో సొసైటీ చైర్మన్ పరుచూరి రాఘవేంద్రరావు (76) నందులపేటలోని తన స్వగృహంలో సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండల గ్రామం తురుమెళ్లలోని జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ అధ్యాపకుడిగా ఉద్యోగ జీవితం ఆరంభించిన రాఘవేంద్రరావు, అదే కాలేజీలో ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం తెనాలిలో అర్బన్ హెల్త్ సెంటర్ పర్యవేక్షకుడిగా చేశారు. అరబిందో సొసైటీ చైర్మన్‌గా అరవింద స్కూల్ బాధ్యతలు చూస్తున్నారు. అరవిందుని సాహిత్య ప్రచురణకు సహకారం అందించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యుడిగానూ ఉన్నారు. పట్టణంలోని పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తూ వచ్చారు. సాయంత్రం ఆయన అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. వివిధ రంగాల ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఏఎన్‌యూకు కంటైనర్‌లో పోస్టల్ బ్యాలెట్లు



తాడికొండ: నేడు ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో తాడికొండ నియోజకవర్గంలో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు సోమవారం కంటైనర్ ద్వారా పోలీసు బందోబస్తు నడుమ ఏఎన్‌యూకు తరలించారు. ఇప్పటి వరకు ఈ పత్రాలను తాడికొండలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సీల్‌వేసి భద్రపరచగా బందోబస్తు నడమ గది సీల్ తొలగించి, కంటైనర్‌లో యూనివర్శిటీకి తరలించారు. ఉదయం 6 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు అనంతరం ఈవీఎం లెక్కింపు జరగనుంది.

నలుగురు జూదరుల అరెస్టు



మేడికొండూరు: మండల పరిధిలోని భీమినేనివారి పాలెంలో ఉన్న ఓ నివాసంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ సిబ్బందితో సోమవారం దాడిచేయడంతో నలుగురు పేకాట ఆడుతూ పట్టుపడ్డారు. వారి నుంచి రూ.2,100 నగదు సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయకుమార్ తెలిపారు.

ఓటరు తీర్పుకు వందనం

- నేడు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు
- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- జోష్‌లో వైఎస్సార్ సీపీ వర్గాలు



తెనాలిలో పోలింగ్ రోజున ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

తెనాలి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తర్వాత ఇరవై రోజులకు పైగా జనం ఉత్కంఠగా ఎదురు చూసిన చివరి ఘట్టం వచ్చేసింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం నుంచి అరంభం కానున్న విషయం తెలిసిందే. తెనాలి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఆచార్య నాగార్జున యూనివర్శిటీలోనే జరగనుంది. పార్లమెంటు, అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేసి ఓట్లను లెక్కిస్తారు. నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు సిబ్బందిని అదే రోజు తెల్లవారు జామున 5.30 గంటలకు నిర్ణయిస్తారు. ఉదయం 8 గంటలకు ఆరంభమయ్యే కౌంటింగ్‌లో మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. నియోజకవర్గంలో పోస్టల్ ఓట్లు 3,586 మంది వినియోగించుకున్నారు. వీటి లెక్కింపు తదుపరి ఒక్కో రౌండు పార్లమెంటు/అసెంబ్లీ ఓట్లను లెక్కిస్తారు. ప్రతి రౌండ్ ఫలితాన్ని ఏజెంటుకు ఆ కేంద్రం వద్ద ఉన్న బోర్డుపై రాస్తారు. సువిధ యాప్‌లో నమోదు చేస్తారు.

మొత్తం 273 పోలింగ్ కేంద్రాలు కలిగిన తెనాలి నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు 20 రౌండ్లు పడుతుంది. ఒక్కో రౌండుకు కనీసం అర్ధగంట సమయం పడుతుంది. మధ్యాహ్నం 2–3 గంటలకు ఫలితం వెలువడే అవకాశమున్నా, నిబంధనల ప్రకారం ఎంపిక చేసిన అయిదు వీవీ ప్యాట్లలో స్లిప్పులను లెక్కించిన అనంతరమే ఫలితాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. ఇందుకు మరో అయిదారు గంటల వ్యవధి పడుతుంది. తెనాలి పట్టణం, రూరల్ మండలం, కొల్లిపర మండలాల పరిధిగా కలిగిన తెనాలి నియోజకవర్గంలో మొత్తం 2,67,624 మంది ఓటర్లకు గానూ మే 13న జరిగిన పోలింగ్‌లో 2,03,825 మంది ఓటు వేశారు. పట్టణంలో 69.11 శాతం ఓట్లు పోలవగా, తెనాలి రూరల్ మండలంలో 84.78 శాతం, కొల్లిపర మండలంలో 86.66 శాతం ఓట్లు పోలైన విషయం తెలిసిందే. మొత్తం 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుంది.

నియోజకవర్గంలో పోలైన ఓట్లు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం	శాతం
తెనాలి అర్బన్	52,933	56,344	1,09,277	69.11
తెనాలి రూరల్	26,648	27,984	54,632	84.78
కొల్లిపర మండలం	19,731	20,170	39,901	86.66
మొత్తం ఓట్లు	99,312	1,04,498	2,03,207	76.16

- 1వ రౌండ్ : హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు.
- 2వ రౌండ్ : ఆలీనగర్, ఎరుకలపూడి, నందివెలుగు, కంచర్లపాలెం, సోమసుందరపాలెం, కఠెవరంలోని 27వ బూత్ వరకు.
- 3వ రౌండ్ : కఠెవరంలోని చివరి అయిదు బూత్‌లు, గుడివాడ, కోపల్లె, అంగలకుదురులో 38వ బూత్, సంగం జాగర్లమూడి
- 4వ రౌండ్ : అంగలకుదురులోని మిగిలిన ఏడు బూత్‌లు, చావావారిపాలెం, సుల్తానాబాద్
- 5వ రౌండ్ : చెంచుపేటలోని 14 బూత్‌లు
- 6వ రౌండ్ : చెంచుపేటలోని చివరి 72వ బూత్, బాలాజీరావుపేట, మారీసుపేటలోని అయిదు బూత్‌లు
- 7వ రౌండ్: తెనాలి మారీస్‌పేట (చివరి 11 బూత్‌లు), పాండురంగపేట, పినపాడులోని 99వ బూత్.
- 8వ రౌండ్: పినపాడు (100–103 బూత్‌లు), మల్లెపాడు, అయితానగర్ (106–113 బూత్‌లు).
- 9వ రౌండ్ : అయితానగర్ (114–117), తేలప్రోలు, నేలపాడు, తెనాలి గాంధీనగర్ (4 బూత్‌లు), రజకపేట (2 బూత్‌లు).
- 10వ రౌండ్ : రజకపేట (128 బూత్), గాంధీనగర్ (మిగిలిన ఏడు బూత్‌లు), గంగానమ్మపేట (ఆరు బూత్‌లు).
- 11వ రౌండ్: గంగానమ్మపేట (4 బూత్‌లు), ఐతానగర్ (8 బూత్‌లు), సాలిపేట (2 బూత్‌లు).
- 12వ రౌండ్ : సాలిపేట (8 బూత్‌లు), చినరావూరు (ఆరు బూత్‌లు).
- 13వ రౌండ్ : చినరావూరు (5 బూత్‌లు), ముత్యంశెట్టిపాలెం, పెదరావూరు (4 బూత్‌లు).
- 14వ రౌండ్ : పెదరావూరు (మిగిలిన 2 బూత్‌లు), జగ్గడిగుంటపాలెం, నాజరుపేట (ఏడు బూత్‌లు).
- 15వ రౌండ్ : తెనాలి నాజరుపేట (4 బూత్‌లు), కొత్తపేట, నందులపేట.
- 16వ రౌండ్ : తెనాలి నాజరుపేట (9 బూత్‌లు), బుర్రిపాలెం, చక్రాయపాలెం (223 బూత్).
- 17వ రౌండ్ : చక్రాయపాలెం, చెముడుపాడు, దావులూరు, చివలూరు, సిరిపురం, అత్తోట, కుంచవరం, దంతలూరు.
- 18వ రౌండ్ : అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు.
- 19వ రౌండ్ : పిడపర్తిపాలెం, గుదిబండివారిపాలెం, కొల్లిపర, దావులూరిపాలెం, తూములూరు (265 బూత్).
- 20వ రౌండ్ : తూములూరు (3 బూత్‌లు), అన్నవరం, బొమ్మువానిపాలెం, అన్నవరం గౌడపాలెం, అన్నవరపులంక.

జోష్‌లో వైఎస్సార్ సీపీ..

ఓట్ల లెక్కింపునకు మూడు రోజుల ముందే పలు సర్వే సంస్థలు వెలువరించిన ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విక్టరీ ఖాయమని తేలటంతో ఆ పార్టీ వర్గాలు ఫుల్ జోష్‌లో ఉన్నాయి. పోలింగ్ రోజునే తమ విజయం ఖాయమన్న భావనకు వచ్చిన వైఎస్సార్ సీపీ వర్గాలకు ఎగ్జిట్ పోల్స్ మరింత ధీమానిచ్చాయి. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ గెలుపు సుస్పష్టమని తేలిపోవటమే కాకుండా రాష్ట్రంలోనూ అధికారంలోకి వస్తామన్న నమ్మకాన్నిచ్చాయి. దీంతో పార్టీ వర్గాల్లో ఉత్సాహం నెలకొంది.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు
డీఎస్పీ ఎం. రమేష్

తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం నుంచి జరగనున్న నేపథ్యంలో తెనాలి సబ్ డివిజన్ పరిధిలో అమలు చేస్తున్న ఆంక్షల గురించి డీఎస్పీ ఎం.రమేష్ విలేకర్లతో మాట్లాడారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు మంగళవారంతో పాటు మరో రెండు రోజుల వరకు తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని డీఎస్పీ ఎం.రమేష్ తెలిపారు. 144వ సెక్షన్, 30 యాక్ట్ అమలు కఠినంగా చేస్తామని, ఎక్కడా నలుగురికి మించి ఉండకూడదని, ఎటువంటి ప్రదర్శనలు, బాణ సంచా కాల్చడానికి అనుమతులు లేవన్నారు. తెనాలిలో 12 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడినా ఘర్షణలకు దిగినా ఉపేక్షించేది లేదన్నా రు. ఆంక్షలు మాత్రం కఠినంగా అమలులో ఉంటా యని అందరూ జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

213 మంది దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు

నగరం: మండల పరిధిలోని గ్రామాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన(దివ్యాంగులు) 213 మంది విద్యార్థులను గుర్తించినట్లు ఎంఈవో కొలసాని హరిబాబు చెప్పారు. పలు గ్రామాలలో సమగ్ర శిక్ష విభాగ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని సోమవారం ఎంఈవో పర్యవేక్షించి మాట్లాడారు. 18 ఏళ్ల లోపు దివ్యాంగ విద్యార్థుల కోసం వారం నుంచి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 213 మందిని గుర్తించామని వెల్లడించారు. సర్వే కొనసాగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు తగిన బోధనోపకరణాలు వినియోగించి వారికి విద్యను అందించడం జరుగుతుందన్నారు.జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న, రీసోర్స్ పర్సన్‌లు సురేష్, మోహనరావు పాల్గొన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న వైదికులు



చిట్టి ఆంజనేయ స్వామి

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్లోని సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం శ్రీ హనుమత్ గాయత్రి హోమం, 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, సాయంత్రం స్వామికి సింధూర అర్చన నిర్వహించారు. వైదిక క్రతువును వైఖానస పండితులు ఆగమోక్తంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త ములుకుట్ల విశ్వనాథ శర్మ సుందరకాండ ప్రవచనం చెప్పారు. భక్తులు విశేషంగా పాల్గొని ఆంజనేయ స్వామికి ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు విశేషంగా పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. 'జయ హనుమాన జ్ఞాన గుణ సాగర' అంటూ భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసాని పటిస్తూ భక్తులు తమ భక్తిని చాటుతున్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకల్లో భాగంగా జూన్ 11 వరకు వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ ఉంటాయన్నారు. ప్రతిరోజు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, స్వామికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేక అలంకరణతో, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ.శివ, నిఖిల్ శాండిల్య, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవా సమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, ఆర్ సురేష్ ,ఎం వెంకటేష్ ,కె రాజశేఖర్, బి లీలాప్రసాద్, గోలి సోమశేఖర్, గుండా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన చిట్టి ఆంజనేయ స్వామి మహోత్సవాలు

తెనాలి: స్థానిక బోసురోడ్డులోని హనుమాన్ చౌక్‌లో గల శ్రీ చిట్టి ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శత జయంతి మహోత్సవాలు, హనుమజ్జయంతి వేడుకలు సోమవారంతో ముగిశాయి. ఉదయం స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సింధూర సహిత జంబీర ఫల సహస్ర నామార్చన నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు డాక్టర్ నోరి నారాయణమూర్తి సుందరకాండ కథాగానం చేశారు. ఆలయ అర్చకులు దీవి యోగానంద చక్రవర్తి, దీవి వేణుమాధవ్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నిర్వహణ కమిటీ సభ్యులు విష్ణుభట్ల రత్నాకరశాస్త్రి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రమాద బాధితులకు పరామర్శ



తెనాలిరూరల్: ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కొల్లిపర మండలం దావులూరు పాలెం గ్రామానికి చెందిన క్షత గాత్రులను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పరామర్శించారు. కొల్లిపర మండలం దావులూరిపాలెంలో ప్రమాదంలో గాయపడిన 10 మంది క్షతగాత్రులను వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పి ఒక్కొక్కరికీ రూ.ఐదు వేల చొప్పున రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. శివకుమార్‌తో పాటు నాయకులు భీమవరపు సంజీవరెడ్డి, వంగా సుధాకర్ రెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, దావూలూరు గ్రామ నాయకులు ఉన్నారు.

లారీ క్లీనర్ అనుమానాస్పద మృతి

మంగళగిరి: పట్టణంలోని ఆటో నగర్‌లో లారీ క్లీనర్ అనుమానాదస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పాత మంగళగిరికి చెందిన శ్రీనివాసరావు(55) లారీ క్లీనర్‌గా పని చేస్తుంటాడు. సోమవారం లారీని ఆటో నగర్‌లో ఆపి వెళ్లారు. ఈ క్రమంలో శ్రీనివాసరావు రోడ్డు మీద పడి మృతి చెంది కనిపించాడు. స్థానికులు సమాచారం మేరకు.. పోలీసులు అక్కడికి చేరకుని అనుమానాదస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి

- వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి శివకుమార్
- పార్టీ కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం



మాట్లాడుతున్న శివకుమార్

తెనాలి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో పార్టీ ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ముఖ్యంగా ప్రతి పోస్టల్ బ్యాలెట్ ఓటును కీలకంగా తీసుకుని నిర్దేశించిన నిబంధనలు అమలు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పార్టీ కౌంటింగ్ ఏజెంట్లతో సోమవారం తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలోని కాన్ఫరెన్స్ హాల్లో సమావేశమయ్యారు. నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎటువంటి అంశాల్ని క్షుణ్ణంగా పరిశీలించాలి.. లెక్కింపు సమయంలో పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాలు ఏమిటి? అనే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యి ఫలితాలను వెలువరించే వరకు కౌంటింగ్ సెంటర్ లోనే ఉండాలని చెప్పారు. ముందుగా ఓట్ల లెక్కింపు నిబంధనలపై నియోజకవర్గ చీఫ్ ఏజెంట్ ఎస్‌బీ శివ ఏజెంట్లకు అవగాహన కల్పించారు. తెనాలి పట్టణ, కొల్లిపర, తెనాలి మండలాలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

16 ఏళ్ల సమస్యకు చెక్‌పెట్టిన జీజీహెచ్ వైద్యులు



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, పక్కన డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పుట్టుకతో వచ్చిన ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న 16 ఏళ్ల బాలుడికి చికిత్సచేసి కాపాడినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగంలో బాలుడి తల్లిదండ్రులతో ఆపరేషన్ వివరాలను ఆయన వివరించారు. గుంటూరు నగరానికి చెందిన సాంబశివరావు, కాంచన దేవి దంపతుల పదహారేళ్ల కుమారుడు పుట్టుకతో రక్తపు వాంతులు, విరోచనాలు, రక్త హీనత, తరచూ జ్వరం, ఎదుగుదల లేకపోవడం వంటి లక్షణాలతో బాధ పడుతున్నట్లు తెలిపారు. పలు ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో మే 16న గుంటూరు జీజీహెచ్ జనరల్ మెడిసిన్ ఓపీకి వచ్చారని పేర్కొన్నారు. వైద్యులు పరీక్షలు చేసి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీకి రిఫర్ చేసినట్లు వెల్లడించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందే కోటి వెంకటేశ్వర రావు రోగికి పరీక్షలు చేసి లివర్‌కు పేగుల నుంచి రక్తాన్ని తీసుకునే వెళ్లే నాళం(పోర్టల్ వీన్) మూత పడిందని గుర్తించారన్నారు. దీనివల్ల పేషంట్ ఆహారం సరిగా తీసుకో లేకపోవడం పెరుగుదల లేకపోవడం, ఈసోఫ్యాజియల్ వారిసిస్, రెక్టల్ వారిసెస్ వల్ల రక్తపు వాంతులు, విరోచనాలుతో బాధ పడుతున్నట్లు వివరించారు. పేషంట్ కు స్ప్లీనెక్టమీ, డీ వాస్కులర్ సర్జరీ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ తరువాత బాలుడికి రక్తపు విరోచనాలు, వాంతులు తగ్గిపోయి, బ్లడ్ సెల్స్ పెరగడంతో ఆరోగ్యం మెరుగుపడిందని వెల్లడించారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందే కోటి వెంకటేశ్వరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో హుండీ లెక్కింపు

కానుకల రూపంలో సమకూరిన రూ.32.01 లక్షల నగదు



ఆలయంలో హుండీ నగదు లెక్కింపు

తెనాలి: స్థానిక వైకుంఠపురంలో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి హుండీ లెక్కింపును సోమవారం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ తిమ్మానాయుడు నేతృత్వంలో ఉండవల్లి గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి కె సునీల్ కుమార్ పర్యవేక్షణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు హుండీ లెక్కింపు జరిగింది. మూడు నెలల కాలానికి సంబంధించి హుండీ లెక్కింపులో పట్టణానికి చెందిన పలువురు భక్తులు, వివిధ సేవా సంస్థల ప్రతి నిధులు, మహిళలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. మొత్తం రూ.32,01,350 నగదు స్వామికి సమకూరింది. నగదుతో పాటు కొంత బంగారం, మరికొంత వెండి కానుకల రూపంలో లభించాయని అధికారులు తెలియజేశారు. భక్తులు, వలంటీర్లు, చెంచుపేట ఏపీసీఓబీ బ్యాంక్ సిబ్బంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్సు, దేవస్థానం సిబ్బంది, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న తాడేపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎస్సీ సెల్ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్ మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పార్టీ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయాలని పట్టణ పరిధిలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఫాదర్ కేకే రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కూరగంటి ఉదయరాజు, స్టూడెంట్ విభాగం కార్యదర్శి తొట్టెంపూడి వికాస్, తాడేపల్లి పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు బత్తుల దాసు, మాజీ ఎంపీటీసీ జీలగ పెదగాలయ్య, రొద్దా ఎలీషా, గొర్రుముచ్చు సుదర్శన్, ఉప్పు శ్రీను, కొండ, మైల రవీంద్ర, కొండకాయల వంశీ, దైత శ్రీకాంత్, వినోద్, వడ్డేశ్వరపు కృష్ణ, పప్పి పాల్గొన్నారు.

విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించే విధంగా మ్యూజికల్ చైర్స్ ఆడించారు. గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విజ్ఞానదాయక అంశాలను చెప్పారు.

పరుపుల దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్



పట్నంబజారు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పరుపుల దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాలు.. నల్లచెరువులోని లారీ స్టాండ్ సమీపంలో ఎం.రాధాకృష్ణమూర్తికి చెందిన దిండ్లు, పరుపుల తయారీ దుకాణం ఉంది. సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేసినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

ఆలయ భూముల కౌలు హక్కుల వేలం

గుంటూరు ఈస్ట్: గుంటూరు నగరంలోని లాలాపేట గ్రూపు దేవాలయాలైన జగన్నాధస్వామి ఆలయం, శ్రీఆంజనేయస్వామి దేవస్థానం, వెంకటేశ్వరస్వామి దేవస్థానాలకు చెందిన పలు మండలాల్లోని వ్యవసాయ భూములను మూడు సంవత్సరాలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామంలో జూన్ 12వ తేదీ వేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో, జూన్ 15న ఉప్పలపాడు గ్రామం శివాలయంలో, చేబ్రోలు మండలంలోని వేజెండ్ల గ్రామంలో జూన్ 14న గ్రామ శివాలయంలో, ఫిరంగిపురం మండలంలో వేమవరం గ్రామంలో జూన్ 13న పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.